# రెండో పాదం

ఏదన్నా అడిగితే కాస్తవిమర్శగా చెబుతానని నన్ను చూస్తే మా రాఘవుడికి గురి. వాడోరోజున నన్ను బీచికి తీసుకుపోయి, కొంతకాలంగా వాణ్ణి బాధిస్తున్న సమస్య గురించి నా దగ్గిర ప్రస్తావన తెచ్చాడు.

"ఒరే అబ్బాయి, నాకు పెళ్ళికాదని ఒక బెంగ పట్టుకుందిరా !" అన్నాడు రాఘవుడు. కారణ మడిగాను.

"నా కిప్పుడు ఇరవై నాలుగో ఏడు. పదహారో ఏటే పెళ్ళి చెయ్యాలని మావాళ్ళు సంబంధాలూ అవీ ఆట్టే చూశారు. కాని నేను చేసుకోనంటే చేసుకోనన్నాను. పెళ్ళయితే చదువుసాగదనీ సంసారభారం మీద పడ్డనాడు చిత్తేననీ మనవాళ్ళంటూ ఉంటారు చూడూ, ఆ మాటలన్నీ విని నాకు పెళ్ళంటే భయమేసింది. చెప్పొద్దూ! అందుకు అప్పట్లో పెళ్ళి ఎగ్గొట్టాను. బ్రహ్మచారి ముదిరినా బెండకాయ ముదిరినా ఎందుకూ పనికిరాదని మా అమ్మ అప్పుడే అంటూ వచ్చింది. అది మటుకు నిజమైనట్టు కనిపిస్తున్నది." అన్నాడు రాఘవుడు.

"నీకేమీ భయమక్కర్లేదు. నీకేమీ వయస్సు మించి

పోలేదు. ఇప్పుడు యీడేరిన పిల్లలు ... కాలేజీల్లో చదువు కుంటున్నవాళ్ళు. బోలెడుమంది దొరుకుతారు" అన్నాను.

"అక్కడే వచ్చింది చిక్కు!" "ఎందువల్ల ?"

ఇప్పుడు నాకు దొరికే మచ్చువాళ్ళని రోజూ బస్సుల్లోనూ, ట్రాముల్లోనూ, వీధివెంటా, బీచిలోనూ చూస్తున్నాను. కాని వాళ్ళల్లో నాకు భార్య కాదగినదీ, నా భార్య అయి నన్ను సుఖపెట్టగలుగుతుందనిపించేదీ... ఒక్కతెకూడా కనబడదు. కొందరు చాలా అందంగాకూడా ఉంటారు, కాని వాళ్ళు నన్ను గురించి ఆలోచించేటందుకన్నా సిద్ధంగా ఉన్నట్లుండరు. నువ్వే ప్రపంచం అనుకోని ఆడది నీకు భార్యఅయి నిన్నేం సుఖపెడుతుంది చెప్పు !"

నేను రాఘవుడి రోగ నిర్ణయం చెయ్యకముందు మరోక ప్రశ్న వేశాను. నీకు చిన్నప్పుడే వివాహం అయి వుంటే ఈ ఇబ్బంది లేకపొయ్యేదనిపిస్తున్నదా ?"

"అనిపించడంలేదు. అటువంటి పెళ్ళి చేతికి సంకెళ్ళగా. అది అనుకూల దాంపత్యం అయినా కాకపోయినా సహించవలసిందేగా ?"

"అయితే, అబ్బీ,నువ్వు రెండో పాదంలో వున్నావు" అన్నాను.

రాఘవుడు నావంక వింతగా చూసి "రెండోపాదం" అన్నాడు.

"కాస్త శ్రద్ధగా విను చెబుతాను. సంస్కారానికి చెందిన ప్రతి పరిణామానికి నాలుగు దశలు. సదుద్దేశాలూ,

విచిత్రభావమూ, ఉన్నతాదర్శాలూనూ. రెండో దశలో, కళ్ళారాధనా సౌందర్యపిపాసా, శిల్పమూ, వ్యక్తిత్వమూనూ; మూడో దశలో ప్రయోజనము, ప్రచారమూ, ఆర్థికదృష్టినీ; నాలుగో దశలో నిర్లిప్తతా, విమర్శనా దృష్టీ, వేదాంత వైఖరీ, విప్లవమూనూ, ఏ విషయంగాని నీకో సమస్య తగిలితే ఆ విషయంలో నీ సంస్కారం ఏ పాదంలో నడుస్తున్నదో తెలుసుకోవాలి. మాటవరసకు సాహిత్యం తీసుకో. ఇప్పటి భావ కవులను తీసుకో—"

"అబ్బ ! భావకవులను పోనిస్తూ !"

"అమ్మో! భావకవులంత సులభంగా పోరు, వాళ్లూ రెండో పాదం వాళ్లే. ఇప్పటి కుర్రకారు సాహిత్యాన్ని మూడో పాదానికి చేరబట్టటానికి చూస్తున్నారు. దీని రహస్యం రెండో పాదం వాళ్ళకు చచ్చినా అర్థంకాదు. సినిమా తీసుకో—"

"పోనీరా ! దాందుంప తెగిరి సినిమా;"

"సరే, నీ యిష్టం... నీ పెళ్ళి విషయమే తీసుకో. మా వంటి వాళ్ళు పెళ్ళి విషయంలో మొదటిపాదం వాళ్ళం. మాకు పెళ్ళి ఒక పవిత్రమైన విషయంగా వెళ్ళిపోయింది. అక్కడ మా వ్యక్తిత్వం అట్టే ప్రధానం కాలేదు. దాంపత్యములో ఒక శిల్పమూ, ఒక సౌందర్యమూ ఉండాలనే విశ్వాసం మాకు కలగలేదు. మొదటిపాదపు సంస్కారంలో స్వీకరించిన భార్యలతో మేమేదోవిధంగా కాలక్షేపం జేస్తున్నాం నువ్విప్పుడు రెండో పాదంలో పడ్డావు. అదే నీ సమస్య" అన్నాను.

"నాకేమీ అర్థంకాలేదు. నాకెందుకు సమస్య కలగాలి! మీ కెందుకు కలగలేదు?"

"సంఘం స్థూలంగా మొదటి పాదానికి సంబంధించిన సంస్కారం పెళ్ళినిగురించి ఆలోచిస్తున్నది. కాని ఇప్పుడిప్పుడే నీ రకం రెండో పాదపు సంస్కారం కూడా ఇటువంటి పట్టణాల్లో తల ఎత్తుతున్నది."

"నన్నింతకూ ఏంచెయ్యమన్నావు? త్వరలో నాకు పెళ్ళవుతుందని నమ్మకం చిక్కకపోతే నేనే పిచ్చెత్తిపోతాను అని రాఘవుడు నన్ను బెదిరించాడు.

"నువ్వు చెయ్యగలిగింది ఒక్కటే వుంది. నీకువివాహ యోగ్యమైన అమ్మాయిలు తటస్థపడినప్పుడు వాళ్ళ పరిచయం కష్టపడి సంపాదించి తద్వారా వాళ్ళల్లో ఎవరన్నా నీకు సరిపడే మనిషి ఉందేమో చూసుకో. నీ గురికి కాస్త బెత్తెడు లోకి వచ్చేదాన్ని చూసుకుని దానిమీద నీ శక్తి యావత్తూ కేంద్రీకరించి అది నీ భార్య కావటానికి వీలయే మార్గం చూసుకో."

రాఘవుడు తల అడ్డంగా ఆడించి, "సలహా అయితే బాగానే ఉంది. గాని ఆచరణలో పెట్టటం అంత సులభంగా కనపట్టం లేదు" అన్నాడు.

"నీకు పెళ్ళి దిగులు తగుమాత్రం ఉంటే అదే సాధ్యమవుతుంది" అని సలహా చెప్పాను.

తరవాత నెల్లాళ్ళకేమో రాఘవుడు కనిపించి మంచి సలహా చెప్పినందుకు నన్నభినందించాడు.

"ఏమిటి కథ ? ఎవత్తె అయినా కనిపించిందా ?" అన్నాడు.

"కనిపించింది. నే నీ మధ్య ఇల్లు మార్చాలే. ఆ మార్చటంలో ఇప్పుడు ప్రవేశించిన ఇంట్లో మా పక్క భాగంలో ఒక కుటుంబం అద్దెకుంటున్నారు. ఆయన కూతురు—పాపం చిన్నప్పుడే భర్త పోయినాట్ట!— సేవా సదనంలో చదువు తున్నది. పేరు విశాలాక్షి. కాస్త చిన్న కళ్లయినా మనిషి అందంగానూ, ఆరోగ్యంగానూ ఉంటుంది. చాలా మంచిది కూడానూ. మొదట్లో పలకరించటానికి భయపడ్డాను గాని తీరా పలకరిస్తే బాగానే మాట్లాడింది. తల్లి తాలూకు ఆస్తి చాలా ఉందిట."

"ఇంకేం ? మరీ మంచిదీ !" అన్నాను.

రాఘవుడి కీ మాట కష్టం కలిగించినట్లు కనపడ్డది.

"నువ్వట్లా అంటున్నావు గాని ఆ దిక్కుమాలిన ఆస్తి నాకెంత ప్రతిబంధకంగా ఉందో నీకేం తెలుసు ? అంత ఆస్తి ఉన్నదాన్ని పెళ్లిచేసుకోమని ఎట్లా అడగను ? అడిగితే నాకు తనమీదే ప్రేమ ఉన్నదని ఎట్లా నమ్ముతుంది ? ఇంకెంత చిక్కో ఆలోచించు" అన్నాడు వాడు.

"నీ బుర్రతో ఆలోచిస్తే పెద్ద చిక్కే"

"కాని నేను విశాలక్షిని నమ్మిస్తానని నాకు ధైర్యం ఉన్నది."

"అబ్బా! నన్నడిగితే నువ్వా విషయం అట్టే విచారించవలసిన పనే లేదంటాను. రేపా పిల్ల ఇంకో భర్తకోసం

వెతికేటప్పుడు కూడా తన ఆస్తి ఆశపెట్టి కాస్త మంచివాణ్ణి తెచ్చుకోవాలని చూడదంటావా ?”

“నేనదే కూడదని గట్టిగా చెబుతున్నాను.”

“ఆ పిల్లతోనే ?”

“కాదు పిల్ల తండ్రితో, ఆయన అప్పుడప్పుడూ నాతో, ‘మా పిల్లకు మంచి సంబంధం ఉంటే చూడు పంతులూ,’ అంటాడు. ‘ఇంత ఈడు వచ్చి, ఇప్పటికాలపు చదువు చదివే పిల్లను ఎరగనివాణ్ణి తెచ్చి కడతారుటండీ ? ఎరిగిన వాళ్ళలోనే విశాలాక్షికి మంచి మొగుడయ్యేవాణ్ణిగా చూచి చేసేయ్యండి,’ అని సలహా ఇస్తాను.”

“ఆయన నీ సలహా వినే ధోరణిలో ఉన్నాడా ?”

“ఆయన దేముందిలే ! అంతా విశాలాక్షి మీద ఉంది.”

“నాకాడ వాళ్ళ సంగతి చెప్పకు. ఆడవాళ్లు సంస్కారం విషయంలో ఏ పాదంలో ఉన్నదీ మనకు చచ్చినా తెలీదు.”

“విశాలాక్షి అటువంటిది కాదు. చదువుకుంటున్నది. అనేక విషయాలను గురించి నీవూ నేనూ ఆలోచించినట్లు ఆలోచించగలదు.”

“అదేమో నీకే తెలియాలి.”

“ఇంకా విశాలక్షి తండ్రే ఏ పాదంలోనూ లేనివాడు”

“అట్లా అనకు. ఆయన మూడో పాదంలో ఉన్నట్లు నాకు సందేహంగా ఉంది.”

“అంటే ?”

"అంటే ఏమిటో నువ్వే ఆలోచించు"

మళ్ళా రెండు మూడు నెల్లదాకా నాకు రాఘవుడు తటస్థపళ్ళేదు. కేవలమూ పరిమాణవశాన వాడూ నేనూ బస్సులో కలుసుకున్నప్పుడు "ఏంరా, రాఘవా, ఏమిటి కబుర్లు ?" అన్నాను. రాఘవుడు మొహం చిట్లించి "ఏమీ లేవు" అన్నాడు.

ఏదో వుందని నాకు వెంటనే అర్థమయింది. వాణ్ణి అటునించి అలా బీచిదారి పట్టించి ఇసకలో కూచోబెట్టి విషయం బయటికి లాగాను.

వాడికీ విశాలాక్షికీ చెడింది. ఎబ్బే, పోట్లాట ఏమీ లేదు. వాడే ఆ పిల్లతో మాట్లాట్టం మానేశాడు. కారణమా ? ఓరోజు, రాఘవుడు ఇంట్లో వుండగానే ఎవరో విశాలాక్షిని చేసుకుంటామని వచ్చాడు.

ముప్ఫై దాటినవాడు. చూడటానికి దిష్టిపిడతల్లే వున్నాడని మా రాఘవుడు వర్ణించాడు. అయితే అట్టహాసంగా సిల్కు సూటూ అదీ వేసుకున్నాడు. నూరురూపాయల ఉద్యోగం చేస్తున్నాడు. ఎక్కడో చీరాలలో ఒక ఇల్లున్నదిట గాని ఆస్తి ఏమీలేదు.

"ఆ సంబంధాన్ని విశాలాక్షి తిప్పేసింది. ఎందుకో తెలుసా ?" అన్నాడు రాఘవుడు తన ఆగ్రహమంతా ప్రశ్నార్థకంతో చూపిస్తూ.

"ఎందుకు ?"

"వాడికి ఆ స్త్రీ లేదని !...ఆ స్త్రీలేదని ! ఇంకెందుకూ కాదు ! మనిషి అసహ్యంగా వున్నాడని కాదు ! రెండో పెళ్ళివాడనికాదు ! వయస్సెక్కువనీ కాదు ! ఆ స్త్రీ లేదని. ఆ స్త్రీ వుంటే తను ఎరగని వాణ్ణి పెళ్ళి చేసుకోవటానికి సిద్ధంగా వుందన్నమాట !"

"అట్లా అనకులే అప్పుడింకే అభ్యంతరం చెప్పేదో!"

"నువ్వట్లా విశాలాక్షిని వెనకేసుకురాకు. ఆమాటలు చెవులారా విన్నవాణ్ణి నేను. ఇటువంటి దానిమీద నిష్కారణంగా ఎంత అభిమానం వృథా చేశానూ!"

"నిన్ను పెళ్ళి చేసుకుంటుందేమో అడిగిచూడూ!"

"నాకా మనిషితో మాట్లాటమే అసహ్యంగా ఉంటే పెళ్ళి చేసుకోమని అడిగేదీ ? నీపుణ్యమాయిరి. నాకటువంటి పెళ్లాం అక్కర్లేదు. అటువంటి దాన్ని చేసుకునే కన్న బతికున్నన్నాళ్లు బ్రహ్మచారిగానన్నా వుంటాను"

"ఆ మాటమీద వుండలేవు. బలవంతాన ఉంటే పశ్చాత్తాప పడతావు. నీకు పెళ్ళి చాలా అవసరమల్లేనే కనుపిస్తుంది"

"అంతగా అయితే ఓపని చేస్తాను. ఎట్లాగో పెళ్ళంటే లాటరీ అని పెద్దలు చెప్పనే చెబుతున్నారు. పత్రికల్లో వరుడు కావాలని చేసే ప్రకటనల్లో ఏదో ఒకటి వీలయినదిగా చూసి అప్లయి చేసేస్తాను. పీడ వదిలిపోతుంది"

"అది మూఢోపాదప్పద్ధతి"

"నీ పాదాలూ హస్తాలూ అవతల పెట్టు. నాకు వాటిల్లో విశ్వాసం పోయింది"

"అవి ఒక చెంప రుజువవుతుంటేనే ?" అన్నాను. కాని రాఘవుడు నామాట వినేస్థితులో లేడు.

ఇది జరిగిన వారం రోజులకే వాడు నాతో శుభవార్త చెప్పేశాడు. వరుడు కావాలని పత్రికలో కనిపించిన ప్రకటన చూసి దానికొక్కటా దరఖాస్తు పెట్టి ఊరుకున్నాడు. ఆ ప్రకటన కూడా నాకు చూపించాడు.

"ఈ ప్రకటన సరిగా మా విశాలాక్షి వంటి దాని కోసమే పెట్టినట్టున్నది గమనించావా ?" అన్నాను.

వాడు గమనించలేదు గాని "మరీ మంచిది. చెప్పా తీసుకొట్టి నట్టవుతుంది. ఈ సంబంధం నేను చేసుకుంటే!" అన్నాడు.

అంతే! వాడు నాకు మళ్ళా మొన్నటివరకు కనిపించ లేదు.

మొన్న కనిపించినప్పుడు "ఏంరా, రాఘవా ? ఏమయింది నీ పెళ్ళి దరఖాస్తు ?" అన్నాను.

రాఘవుడు పెదిమ కొరుక్కొని "అది విశాలాక్షి తండ్రి చేసిన ప్రకటనే !" అన్నాడు.